క్లుప్తంగా

సదాశివేశ్వరునికి భారీ ఆదాయం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో సదాశివేశ్వరుని శివరాత్రి ఆదాయం రూ.11,87,675 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు శ్రీధర్‌వర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగిన శివరాత్రి ఉత్సవంతో సుమారు 50వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హుండీ ద్వారా రూ.6,47,752, కామాక్షమ్మ హుండీ 76,402, రాజరాజేశ్వరమ్మ హుండీ రూ.7290, తలనీలాలు వేలం ద్వారా రూ.1,75,000, తాత్కాలిక అంగడి రూ. 13,400, కొబ్బరి చిప్పలు రూ.3,400 ప్రత్యేక దర్శనం రూ.2,06,510, కామాక్షమ్మ దీపాల విక్రయం రూ.35,900, తలనీలాల టికెట్లు రూ.13,720, అభిషేకం టికెట్ల ద్వారా రూ.8,301 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

మసీదు అభివృద్ధికి కృషి


నూతన అధ్యక్షుడు హమీద్‌ఖాన్‌కు సన్మానం

కార్వేటినగరం: మసీదు అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానని జామియా మసీదు నూతన అధ్యక్షుడు పి.హమీద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జామియా మసీదు కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదు నూతన అధ్యక్షుడు హమీద్‌ఖాన్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తనను ఎంపిక చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ ముస్లింలు, మసీదు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మరోసారి మసీదు అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు మత పెద్దలకు, ముస్లింలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. మత పెద్దలు, ముస్లింలు నూతన అధ్యక్షుడు హమీద్‌ఖాన్‌ను శాలువాలు కప్పి, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

చెరుకు గానుగపాకంలో పడి వ్యక్తి మృతి


ప్రేమ్‌దాస్

శ్రీరంగరాజపురం: చెరుకు గానుగ పాకంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపురం దళితవాడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వెంకటాపురం దళితవాడకు చెందిన సుబ్బయ్య కుమారుడు ప్రేమ్‌దాసు(46) గురువారం తమ చెరుకు గానుగ పాకం దించుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరుకు పాకంలో పడి పోయాడు. తీవ్రగాయాలపాలైన ప్రేమ్‌దాస్‌ను స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మరణించాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


డెస్కులపై హాల్ టికెట్ల నెంబర్లు వేస్తున్న కళాశాల సిబ్బంది

పాలసముద్రం: మండల కేంద్రం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని శుక్రవారం ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. మొదటి సంవత్సరం 101మంది, ద్వితీయ సంవత్సరం 92 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు డెస్కులు, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల్లోగా విద్యార్థులు కేంద్రానికి హాల్ టికెట్‌తో హాజరు కావాలని కోరారు. చీఫ్ సూపరింటెండెంట్ వినాయకం, డిపార్టుమెంట్ ఆఫీసర్ శివశంకర్ తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

విజయపురం: ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రయ్య పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్యామల చేతుల మీదుగా 30 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలతోపాటు, పెన్నులు అందించారు. విద్యార్థులకు తమ వంతు సాయం అందించడం అభినందనీయమని ఆమె అన్నారు.

ధాన్యం.. దళారులపాలు

- మద్దతు ధర లేక నష్టపోతున్న రైతులు
- కనిపించని కొనుగోలు కేంద్రాలు
- 80 కిలోల ధాన్యం బస్తాకి దళారుల ధర రూ.1550

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల రైతులు దళారుల చేతిలో మోసం పోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అరకొరగా అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 80 కేజీల ధాన్యం బస్తాకు దళారులు కేవలం రూ.1550 మాత్రమే ఇచ్చి రైతులను దోచుకొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదు. దీంతో దళారులు సిండికేట్‌గా మారి రైతులను నష్టాల పాల్జేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

వడమాలపేట మండలంలో ఈ ఏడాది రబీలో సుమారు 300 హెక్టార్లకు పైగా వరి సాగు అయింది. ఇప్పటికే పాదిరేడు, టీసీ అగ్రహారం తదితర గ్రామాల్లో వరి నూర్పిడి చేయగా, మిగిలిన గ్రామాల్లో వరి కోతకు రైతులు సిద్ధమవుతున్నారు. వరికి గిట్టుబాటు లేక రైతులు తీవ్ర నష్టపోతున్నారు. అన్నదాత ఆరుగాలం శ్రమపడి అప్పుల పాలవుతున్నారు.


టీసీ అగ్రహారంలో వరి ధాన్యం కొనుగోళ్లు

ధాన్యానికి గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో రైతు దగా పడాల్సి వస్తోంది. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్న చిత్తశుద్ధి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రైతులు మండిపడుతున్నారు.

దళారులదే పైచేయి

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక ధాన్యం కొనుగోళ్లను సహకార పరపతి సంఘాలతోపాటు వ్యవసాయ మార్కెట్లకు అప్పజెప్పింది. తర్వాత రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత అధిక శాతం వాటి నుంచే కొనుగోలు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యానికి మద్దతు(ఎంఎస్‌పీ) ధర ప్రకటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు నిర్ణయించిన ధరలకే రైతులు పంటను అమ్ముకొని నష్టపోతున్నారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని, దుమ్ముధూళి ఉన్నాయంటూ ధరలు తగ్గించి, 80 కిలోలకు రూ.1550 చెల్లిస్తున్నారని రైతులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

శుద్ధి చేసిన వరికి మాత్రమే



వరిని ఎండబెట్టి, శుద్ధి చేసిన ధాన్యానికి రూ.1725 ఇస్తారు. రైతులు అలా చేయడం లేదు కాబట్టి ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరలకు తీసుకొంటున్నారు. రైతులు శుద్ధిచేసి ఎండబెట్టిన ధాన్యాన్ని తక్కువ ధరలకు తీసుకుంటే చర్యలు తీసుకొంటాం. –విజయకుమార్, ఏఓ, వడమాలపేట

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



రైతుల నుంచి వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అలా కొనుగోలు చేయకపోవడంతోనే రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలి. – గుణశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి

చట్టం ముందు అందరూ సమానం


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

పాలసముద్రం: భారత రాజ్యాంగం రూపొందించిన చట్టం ముందు కుల, మతాలకు, పార్టీలకతీతంగా అందరూ సమానమేనని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. సివిల్ రైట్స్‌డేని పురస్కరించుకుని శుక్రవారం వెంగళరాజుకుప్పం పంచాయతీ ఇందిరానగర్, రేణుక పరమేశ్వరి దేవాలయం ఆవరణలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ పౌర హక్కులు, విధులు, ఆదేశ సూత్రాలు తదితర అంశాలను వివరించారు. ప్రభుత్వం ప్రవేశం పెట్టిన పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దేవాలయాల పబ్లిక్ స్థలాలను అందరూ స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని తెలిపారు. నిత్యజీవితంలో సమస్యలు ఏమైనా తలెత్తితే వాటిని అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఐ దేవి, వీఆర్ఓ శ్రీనివాసులు, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది


నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత వై.కుమారస్వామిరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం గోపాలకృష్ణాపురం సర్పంచ్ వేలాయుధం తల్లి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అన్నా లోకనాథం, నాయకులు శ్రీనివాసులురెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి


గోవర్ధన్ (ఫైల్)

కార్వేటినగరం: చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం అన్నూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శుక్రవారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామానికి చెందిన గోవర్ధన్ కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి దళితవాడలోని తన అత్త ఇంటికి వెళ్లాడు. స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో అన్నూరు బస్ స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న చొక్కలింగం(66)ను ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై నుంచి రోడ్డుపై పడిన గోవర్ధన్(33) తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం తిరుపతికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కేకేసీ కళాశాలలో పుత్తూరు వాకర్స్ అసోసియేషన్, కేకేసీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసిన వారి ఆరోగ్యం మరింతగా మెరుగుపడుతుందన్నారు. బ్లడ్ డొనేషన్ డ్రైవ్స్ నిర్వహిస్తూ పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్‌ని అభినందించారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవాలని సూచించారు. శిబిరంలో రక్తదానం చేసిన 53 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిచ్చాటూరు తహసీల్దార్ సుబ్రమణ్యం, డాక్టర్ రవిరాజు, కేకేసీ చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్ నరసింహారావు, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎల్ మూర్తి, కార్యదర్శి మునికృష్ణారెడ్డి, నాయకులు గోపీకృష్ణ, గుణశేఖర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారం మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌సీసీబీ, వై ఫోర్ డి ఫౌండేషన్ సహకారంతో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని బుగ్గఅగ్రహారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు మాట్లాడుతూ షుగర్, బీపీ, క్షయ, క్యాన్సర్ తదితర రోగాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ వైద్య శిబిరంలో శ్రీనివాసన్ ఐ కేర్ హాస్పిటల్, తిరుపతి వారు పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈసీ మెంబర్ డాక్టర్ డి.కోదండరామిరెడ్డి, డాక్టర్ పార్థసారథి, ఏఎన్ఎం పుష్ప, ఆశ వర్కర్లు జయమ్మ, సుబ్బలక్ష్మి, హెచ్‌ఎం బాలాజీ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్‌డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్ల సంఘ సభ్యులు

నగరి: ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టైలర్స్ సంక్షేమ సంఘం సభ్యులు ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. సంఘ కార్యాలయం వద్ద కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక సిరీడ్స్ బధిర పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఉమాపతి, టి.వీరయ్య మాట్లాడుతూ టైలర్లు ఐకమత్యంతో ఏకతాటిపై నిలిచి అభివృద్ధి వైపు ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవ ఉపాధ్యక్షుడు ఎస్.నాగూర్ బాషా, ఉప కార్యదర్శి కె.రాజ, కోశాధికారి కె.కృష్ణయ్య, సలహాదారులు పి.రాజేంద్రరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎం.గణేశ్, హమీదు, హాతింబాయ్, ధనరాజ్, నటరాజ్, రాధమ్మ, పళని, శంకర్, జైలా, శ్రీనివాసులు, మునిరత్నం రెడ్డి, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు మోసం

నగరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను మోసం చేసేలా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీఆర్ మునిరత్నం అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై శుక్రవారం ఈ మేరకు ఆయన స్పందించారు. బడ్జెట్‌లో పీఆర్‌సీని వాయిదా వేస్తూ ఉపాధ్యాయులు కష్టాల పాల్జేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే ఐఆర్ ఇస్తాం ఇవ్వకుంటే నిలదీయండి అన్న కూటమి నేతలు ఉద్యోగులను మరిచారన్నారు. వెంటనే ఉద్యోగులకు పీఆర్సీ కమిషన్ వేయించాలని, ఐఆర్ ప్రకటించాలని, బకాయిలను నిబద్ధతతో కూడిన ఒక ప్రణాళికతో చెల్లించాలని డిమాండ్ చేశారు.

పరీక్ష సామగ్రి వితరణ ప్రశంసనీయం


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు పరీక్షా సామగ్రి అందించడం ప్రశంసనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధి లోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యువత శ్రీకృష్ణ, విజయ్‌కుమార్ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. యువతరంలోనే దాతృత్వాన్ని పెంచుకోవడం తన తల్లిదండ్రుల ఉన్నతిని గుర్తు చేస్తోందన్నారు. విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమన్నారు. తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని విద్యాభ్యాసం చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా దాతలను హెచ్‌ఎం కేశవులు ఘనంగా సన్మానించారు. పాఠశాల వైస్ చైర్మన్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగాల ప్రదర్శనకు పోటీ


ఎం.కొత్తూరులో విద్యార్థుల ప్రదర్శన


బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ వీరయ్య


ఆముదాల హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

నగరి: మేమూ శాస్త్రవేత్తలమే అంటూ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ అంశాలపై స్వంతంగా సైన్స్ నమూనాలను తయారు చేసి చూపరులను ఆకట్టుకున్నారు. నగరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన మోడ్రన్ సిటీ, జూపార్క్, అగ్నిపర్వత నమూనాలు, బ్యాటరీ కార్లు, చిత్రపటాలు అందరినీ అలరించాయి. ప్రతి పాఠశాలలో తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలో ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శన

పాలసముద్రం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆముదాల, తిరుమలరాజుపురం, బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఆముదాల హైస్కూల్‌లో హెచ్‌ఎంలు మీనాక్షి, రఘు సరస్వతి పూజలు చేసి జ్యోతి వెలిగించి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, హెచ్‌ఎం మీనాక్షి విద్యార్థులకు బహుమతులు అందించారు. బలిజ కండ్రిగ హైస్కూల్ ఇన్‌చార్జీ హెచ్‌ఎం రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు డి.ధనరాజ్, కె.సువర్ణ, వెంకటేషన్, రమేష్, సీఆర్‌పీలు మునిరాజ్, శరవణన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో..

విజయపురం: రామన్ తన యావత్ జీవితాన్ని దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి కోసం త్యాగం చేశారని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జ్ఞానకుమార్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, గోపి, వెంకటేశ్, విజయకుమార్, వెంకమరాజు, విజయవర్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

నింద్ర: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన నింద్ర జిల్లా ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంఈఓ శ్రీధర్‌రాజు విద్యార్థులకు బహుమతులు అందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంపొందించాలి

కార్వేటినగరం: విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని, దృక్పథాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశిక్షణ డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శుక్రవారం డైట్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. మండలంలోని కత్తెరపల్లి, డీఎం పురం, కేఎం పురం, పాదిరికుప్పం, ఆర్కేవీబీపేట, టీకేఎం పేట, గంగమాంబాపురం, కార్వేటినగరం మండల కేంద్రంలోని ఆర్కేఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్, ఎంఈఓ–2 మనోజ్‌కుమార్. కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో సమాజాభివృద్ధి

పుత్తూరు: సమాజ అభ్యున్నతికి విజ్ఞాన శాస్త్రం ఉపయోగపడాలని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వి.వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరయ్య మాట్లాడుతూ ప్రతి సైన్స్ విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పాలని కోరారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పద్మావతి, శాంసన్‌రాజు, గాయత్రి, వసంతకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

- డైయింగ్ యూనిట్ల మూసివేతపై దద్దరిల్లిన సమావేశం
- టేబుల్ అజెండాగా ఉంచి సంతకం చేసిన కౌన్సిలర్లు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నగరి: డైయింగ్ యూనిట్ల వ్యవహారంపై మూడోసారి మున్సిపల్ కౌన్సిల్ దద్దరిల్లింది. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలు చదివిన అనంతరం విప్ దయానిధి, కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల మూసివేతపై ఏం చర్యలు తీసుకున్నారంటూ అధికారులను ప్రశ్నించారు. ఏఈ వారికి వివరణ ఇస్తూ కౌన్సిల్ గత సమావేశాల్లో పేర్కొన్న మేరకు 16 మిషన్ డైయింగ్ యూనిట్లను తనిఖీ చేశామన్నారు. 12 యూనిట్లకు ఈటీపీ లేదని గుర్తించామన్నారు. మిగిలిన నాలుగు ప్లాంట్లలో ఒకటి మూతబడిందని మిగిలిన మూడింటికి ఈటీపీ ఉన్నా నామమాత్రంగానే వినియోగిస్తున్నారన్నారు. తనిఖీల వివరాలతో కూడిన నివేదికను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపించామన్నారు. అయితే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. దీనిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ఈ సమస్యపై పోరాడుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటే కౌన్సిల్ ఎందుకున్నట్లు, వారికో సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నట్లు అంటూ అధికారులను నిలదీశారు. కౌన్సిలర్ ఇంద్రయ్య మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో బహిష్కరణకు గురైన డైయింగ్ యూనిట్లు కలుషిత నీటిని నగరి ప్రజలపై వదులుతున్నారన్నారు. వైస్‌చైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల మూసివేత అంశాన్ని అజెండాలో ఉంచితే తాము ఆమోదిస్తామన్నారు. ఇప్పుడే రాసి సంతకాలు చేసి ఇవ్వండని కమిషనర్ కోరగా కౌన్సిలర్లు అందరూ సంతకం చేస్తే టేబుల్ అజెండాగా పెట్టేస్తామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. వెంటనే డైయింగ్ యూనిట్ల మూసివేత అంశాన్ని టేబుల్ అజెండా పొందుపరచారు. దీనిపై సమావేశంలోని కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు సంతకాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.